# చట్టం - చుట్టం

"కుదర్దువై నరసింహం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అప్పారావు.

"ఎందురక్కుదర్దు? అప్పుడెల్లా కుదిరింది?" అని గొంతుక చించుకొని అరుస్తున్నాడు నరసింహం అప్పారావు మీద.

నరసింహం ఆ ఊరి కాలేజీలో లెక్చరర్. ఎటువంటి పరిస్థితుల్లో అయినా ఎటువంటి వారికైనా పాఠం చెప్పేయగలడు. అతని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది.

నరసింహం ఒకసారి ప్రభుత్వం ఖర్చు మీద ఢిల్లీ వెళ్ళాడు. అదే మొదటిసారతగాడు ఢిల్లీ వెళ్ళటం. అంతకు ముందు అతన్నెవరు ఢిల్లీ రమ్మన్లేదు. అతనోపూట తీరిక దొరికి ఊరంతా చూస్తూ ఇందిరమ్మ ఇంటి చుట్టు పట్లకి చేరాడు. అక్కడ సెక్యూరిటీ ఎరేంజ్‌మెంట్స్ చూస్తుంటే నరసింహానికి ముచ్చట వేసింది. ఇండియన్ సెక్యూరిటీ సిస్టమ్‌ని కాస్త స్టడీ చేస్తూ పోతుంటే స్టడీ చేయబడ్తున్న వాళ్ళకి కొద్ది అనుమానం, ఆ పైన కొద్ది భయం కలిగి అతన్ని చుట్టు ముట్టారు. అతన్ని రక రకాల ప్రశ్నలడిగి అతను ప్రమాదకరమైన వ్యక్తి కాదని అనవసరపు కుతూహలం కల సైన్సు లెక్చరర్ అని పోల్చుకొని పొమ్మన్నారు. నరసింహం పోలేదు.

"మీ పేర్లేమిటి?" అని అడిగాడు.

"నాలో మీ కనుమానం కలిగించిన విషయం ఏమిటి? తిరుపతి మొక్కు కోసం పెంచు కొన్న గెడ్డమా?" అని అడిగాడు.

"ఇందిరమ్మకి ఇంత సెక్యూరిటీ ఎందుకు?" అని అడిగాడు.

ఇల్లాంటి ప్రశ్నలడగటంలో ఒక ధాటీ చూపించాడు. వాటికి వాళ్ళు సరిగా సమాధానాలు చెప్పలేదు, అడగటమే కాని చెప్పటం అలవాటు లేక. ఆ సరిగ్గా జవాబు చెప్పనివాళ్ళని, వెనక బెంచీ వాళ్ళని ఒక మేష్టరు చూసేటట్టు చూసాడు. ఈ మొహాలు ఇంత పెద్ద ఉద్యోగాల్లో ఎల్లా ఉన్నారని అనుమానపడ్డాడు. "మీరు పెద్ద ఉద్యోగాల్లోకి పరీక్షలు వ్రాసి, ఇంటర్వ్యూల్లో సెలక్టయి వచ్చారేమో కదా!" అని వాళ్ళని ఎద్దేవా చేస్తాడు. ఇంకా సేపుంటే సెలక్షన్స్‌ని ,ప్రభుత్వాన్ని కూడా ఈయన విమర్శించేటట్టున్నాడనుకొంటూ చుట్టుముట్టినవా రతని చుట్టుపట్ల లేకుండా జారుకొన్నారు.

అంతేకాదు నరసింహం పులిలాంటి పోలీసు ఇన్‌స్పెక్టర్ అప్పారావుని ఎక్కడ పడ్తే అక్కడ నిలబెట్టి రిక్షా వాళ్లు, బస్సు డ్రైవర్లు చూస్తున్నారనైనా లేకుండా కడిగెయ్యగలడు. అతనికి ఆ చనువు, ఆ ధైర్యం ఉన్నాయి.

దానికి అతను, అప్పారావు సెంటాంథనీస్ బడిలో మూడో క్లాసు నుంచి పదో తరగతి వరకు ఒకే బెంచీ మీద కూర్చుని గిల్లుకుంటూ, కొట్టుకొంటూ చదువుకోటం ఒక కారణమయినా నరసింహం నిర్భీతి అసలు కారణం.

ఇంతటి నరసింహం ఓ ఒద్దరి ముందు నోరు విప్పలేడు. ఒకరు అతని అల్లుడు దుర్గాప్రసాద్. రెండోది అతని అర్ధాంగి వరలక్ష్మి. అల్లుడు దుర్గాప్రసాద్‌ని లొంగదీసుకోటానికి అప్పారావు సహాయం చేసాడు అప్పుడు. ఇప్పుడు వరలక్ష్మిని అదుపులో పెట్టటానికి నరసింహం సహాయం అడిగితే అప్పారావు "కుదుర్దువై" అనేసాడు.

"ఎందుక్కుదర్దు?" అని నిలదీసాడు నరసింహం.

"చెల్లెమ్మని అరెస్ట్ చెయ్యడానికి రూల్సొప్పుకోవ్!" అని తేల్చేసాడు అప్పారావు.

"పరిదానమిస్తే పాలిస్తువేమో!"

"నన్ను తెలుగులో తిట్టకు. నా కర్థం కాదు. నీగ్గొంతు నొప్పి. ఇంగ్లీషులో తిట్టు."

"ఏం బ్రైబ్ చేస్తే రూల్స్ పుట్టుకొస్తాయిట?"

"నే నూరుకొంటుంటే నువ్వు పేట్రేగి పోతున్నావ్. పోలీస్టేషన్లో పబ్లీగ్గా లంచం మాటెత్తుతావా? నేను మీ ఇంటికి వచ్చి చెల్లెమ్మతో నిన్ను సుబ్బరంగా వేపుకు తినేయమని చెప్తాను. సింహాచలం గానుగ నుంచి నేనే నూనెత్తెచ్చి యిస్తాను. ఏమనుకుంటున్నావో! నేన్దగ్గరుండి అంతా చూసుకొంటాను కనుక కేసుండదు. క్లాసుకు మిగలకుండా పోతావ్" అని అప్పారావు కూడా నోరు చేసుకొన్నాడు.

నరసింహం ప్లేటు మార్చేసాడు.

"చూడవై అప్పారావు. నీకు శ్రీకృష్ణ నిర్యాణంలో అతేరారథికుండు అన్న పద్యం గుర్తుందా?" అని అనునయం అడిగాడు.

ఎందుకైనా మంచిదని అప్పారావు "లేదు" అన్నాడు.

"అదేమిటివై. అప్పటినుంచి ఇప్పటి దాకా నీకు ఆ పద్యం రాలేదా. ఆశ్చర్యంగా ఉందే? అప్పుడు క్లాసులో నీకు పద్యం రాలేదని తెలుగు మేష్టరు బెంచెక్కించి, మళ్ళీ దింపి డస్టర్‌తో నీ తల మీద కొట్టాడు. నీకు తల చిట్లి రక్తం వచ్చిందీ... అప్పుడు నువ్వు...."

నరసింహం, వాళ్ళ ఇన్‌స్పెక్టరు అప్పారావు చిన్నతనాన్ని గురించి వర్ణిస్తూంటే, బాలకృష్ణుడి కథలు వినడానికి ఉత్సాహించే పెద్ద కృష్ణుడి భార్యల్లాగ, ఉత్సాహంతో వినసాగారు పోలీసు స్టేషన్లోని అప్పారావు అనుచరులు. అప్పారావుకి వాళ్ళ ఉత్సాహం నచ్చలేదు.

"అందరు ఇక్కడెందుకు? పంజాబు టెర్రరిస్టులు వచ్చి మన తుపాకులెత్తుకు పోయినా దిక్కుండదు. పొండి బయటకు" అని కసిరాడు అప్పారావు వాళ్ళని.

వాళ్లు బయటికి చాలా అయిష్టంగా కదిలారు.

"ఏమిటా పద్యం?" అప్పారావు సిగ్గు పడుతూ అడిగాడు అనుచరులు బయటకు వెళ్ళాక.

"శ్రీకృష్ణుడు చచ్చిపోయాక, అర్జునుడు తన కప్పచెల్లెళ్ళ వరసైన శ్రీకృష్ణుడి స్త్రీలతో బయల్దేరి వస్తుంటే కిరాతకులు వాళ్ళ నెత్తుకుపోయారుట. ఆ విషయం చెప్తూ 'భారతయుద్ధం నాటి రథమే అప్పటి రథికుడినే కాని, ఏం చెయ్యలేకపోయాను' అంటాడు ధర్మరాజుతో అర్జునుడు."

"ఆ పద్యం ఎందుకు చెప్తున్నానిప్పుడు?" అనుమానంగా అడిగాడు అప్పారావు.

"మా అల్లుడు దుర్గాప్రసాద్ విషయంలో నువ్వు ఎంత చురుకుగా పన్చేసావ్! ఇప్పుడు మా వరలక్ష్మి విషయంలో ఎంత మన్ను తిన్న పాములా ఉన్నావ్? అప్పుడూ ఇదే పోలీసుస్టేషన్. నువ్వే ఇన్‌స్పెక్టర్. నేనే బాధితుడ్ని అప్పుడూ ఇప్పుడూను. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమిటి? అప్పుడు నన్ను వేపుకు తిన్నది నా అల్లుడు. ఇప్పుడు నన్ను వేపుకు తింటున్నది నా తల్లి కోడలు. అప్పుడూ నాకు ఆర్థిక స్తోమత లేదు. అల్లుడి కోర్కెలు తీర్చటానికి. ఇప్పుడూ ఆలి కోరికలు తీర్చే సంపాదన లేదు. అప్పుడు దుర్గాప్రసాద్ నేరస్థుడైతే ఇప్పుడు వరలక్ష్మి ఎందుకు కాదు? అల్లుడికో రూలు అప్పచెల్లెలు కోరూలా?" నరసింహం తన వాదన పూర్తి చేసాడు.

రెండేళ్ళ క్రితం నరసింహం తన పెద్ద కూతుర్ని విజయవాడ వాస్తవ్యుడైన బావగారి కొడుకు దుర్గాప్రసాద్ కిచ్చి వివాహం చేసాడు, ఆ తరువాత "మా జిల్లా ఆనవాయితీ ప్రకారం మీ నాన్న నా కదివ్వాలి ఇదివ్వాలి" అంటూ దుర్గాప్రసాద్ భార్యని వేపుకు తినేవాడు. వీళ్ళతో వేగలేక అప్పారావుని ఆశ్రయించాడు నరసింహం, అతని సలహా ప్రకారం నరసింహం దుర్గాప్రసాద్‌ని పండుగకి పిలిచి స్నేహితుడి దగ్గర కంటూ పోలీస్ స్టేషన్‌కి తీసుకు వెళ్ళాడు. అప్పుడు అప్పారావు దుర్గాప్రసాద్‌తో -

"బాబ్జీ! నువ్వు నా కొడుకులాంటోడివి. పూర్తిగా నా కొడుకువై ఉంటే మక్క లిరగదన్నేద్దును. కాని నువ్వు నా కొడుకు లాంటోడివి మాత్రమే. అందుకని మాటల్తో పోనిస్తున్నాను. నువ్వు కట్నం తీసుకున్నావని నాకు తెలుసు. అందులో కొంత మొత్తం నేనే సర్దాను. లేకపోతే మేష్టర్ల దగ్గరంత మొత్తం ఎక్కడుంటుంది? అందుకే నిన్ను ఎరెస్టు చెయ్యగలను. కాని చెయ్యలేదు. చెయ్యను. అద్నాలక గొంతెమ్మ కోర్కెలు కోర్తున్నావుట. మరోసారి గొంతు పెగిలిందంటే పీకనొక్కేయగలను. నా కల్లుడివి కావు కదా! కొడుకు లాంటోడివి. అందుకని తప్పు లేదు. అమ్మడికి అర్ధ రూపాయి కిరసనాయిలు అందేలా ఏర్పాటు చేసి వళ్ళంటుకోకుండా చీర అంటించుకోమని సలహా చెప్పి, కట్నం కోసం, కానుకల కోసం నువ్వే కాల్చాలని ప్రయత్నించావని కాల్చుకొన్నాక తినాలని నీ అభిప్రాయం అని కేసెట్టి బొక్కలోకి తోసెయ్యగలను. జాగ్రత్త. బుద్ధిగా ఉండు" అన్నాడు. దుర్గాప్రసాద్ బెదిరిపోయాడు దాంతో.

అల్లుడి బెడద తీరిపోయి 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకొంటూ ఉంటే వరలక్ష్మికి ఇరుగమ్మతోను పొరుగమ్మతోను స్నేహాలు ఏర్పడి చిన్న చిన్న కోర్కెలు మొలకెత్తాయి. పోనీలే అని అవి తీర్చాడు నరసింహం.

ఆమె క్రమంగా కోర్కెల స్థాయి పెంచుకొంటూ పోయింది. నరసింహానికి అందుబాటులో లేనంతగా ఎదిగిపోయాయి అవి. అప్పుడు "నా దగ్గర డబ్బులేదు మొర్రో" అని నరసింహం అంటే - "ఉండదు. ఎందుకుంటుంది! నేను పరాయి తండ్రి కన్న అమ్మని! మీ పిల్లలకైతే ఉంటుంది? నా కెందుకుంటుంది. నా కెప్పుడే ముచ్చట తీరింది కనక" అంటూ నిష్ఠూరాలాడింది మొదట్లో. ఆపైన ఎల్లాగైనా తెచ్చి పెట్టమని వేపుకుని తినటం మొదలు పెట్టింది. ఈ వేపుడు నరసింహం తట్టుకోలేక పోయాడు.

అందుకని మరోసారి నరసింహం, అప్పారావు సహాయం కోరాడు. అప్పారావు,

"కుదర్దువై" అన్నాడు.

"ఎందుక్కుదర్దు?" అన్నాడు నరసింహం కుదిరి తీరాల్సిందే అన్న ధోరణిలో.

"ఎందుకంటే అర్జునుడి విషయంలో కృష్ణపరమాత్మ చావు వల్ల ఆ తేడా వస్తే, నా విషయంలో అటువంటి చట్టం ఉండిచావక నీతో నాకు చావు వచ్చింది" అన్నాడు నరసింహంతో అప్పారావు.

"చూడు అప్పారావూ...." అంటున్న నరసింహంతో -

"చూడను. చెల్లెమ్మకి ఫెయిర్ ప్రైస్ షాపు నుంచి రూపాయి కిరసనాయిలు అరువు మీద ఇప్పిస్తాను. వళ్ళంటుకోకుండా చీర అంటించుకోమని చెప్తాను. ఆ తరువాత పెళ్ళయి పాతిక సంవత్సరాలైనా అత్తా మామా చచ్చిపోయినా చెల్లెమ్మనింకా పుట్టింటి నుంచి అదీ ఇదీ తెమ్మని పీడిస్తున్నావని కేసు పెడ్తాను. అల్లుడికీ కిరసనాయిలు రూలే! మావకీ కిరసనాయిలు రూలే! చట్టాలు చుట్టరికంతో మారవు. ఫో గెట్ లాస్ట్" అని అరిచాడు అప్పారావు.

ఎప్పుడూ నరసింహం బాబు ఇన్‌స్పెక్టర్ బాబు మీద తాడెత్తున ఎగరటమే కాని రివర్సు ఫోర్సు చూడని పోలీసు బృందం అప్పారావు బాబులో ఇంకా చా౹వ మిగిలినందుకు సంతోషించారు. పోలీసులకి కంప్లయింటు ఇవ్వబడిన వాళ్ళ మీద చర్య తీసుకొనే అవకాశం లేకపోయినా ఇచ్చినవాళ్ళ మీద ఏక్షన్ తీసుకొనే ఏర్పాటుండదూ!

*- క్రోక్విల్ హాస్యప్రియ, '88*

★